ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 103 మంగళవారం 16, డిసెంబర్ 2025 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com



# బాలసుబ్రహ్మాణ్యం అందరివాడు

**రవీంద్రభారతిలో విగ్రహావిష్కరణ**
**సాయంత్రం సంగీత విభావరి నిర్వహణ**
**బాలూ పరిపూర్ణ కళాకారుడు: వెంకయ్య నాయుడు**
**ఘంటసాల తర్వాత**
**అంతటి గొప్ప గాయకుడు: దత్తాత్రేయ**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రవీంద్రభారతి ప్రాంగణంలో ప్రముఖ గాయకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి ఎస్పీ బాలసుబ్రహ్మాణ్యం విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్‌బాబు, ..మిగతా 2లో

# ముగిసిన మూడో విడత ప్రచారం


**రేపు 182 మండలాల్లో 3752**
**గ్రామ పంచాయతీలకు ఎన్నికలు**
**ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు**




# ఓట్ చోరీ కాంగ్రెస్ అజెండా

**ఈ అంశంతో మాకు ఏ సంబంధం లేదు**
**జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా**
**ఇండియా కూటమిలో**
**మొదలైన లుకలుకలు**

02



# 2029 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా?

**సామాజిక తెలంగాణ సాధించడమే నా లక్ష్యం**
**యువతకు ఉపాధి**
**కల్పించడం కోసం కృషి చేస్తా**
**కొత్త పార్టీ పేరు రివీల్ చేయని కవిత**
**కేటీఆర్ ప్రస్తావన తీసుకొస్తే నో కామెంట్**
**నెటిజన్లతో కవిత # ఆస్క్ కవిత నిర్వహణ**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత డిసెంబర్ 15, 2025 సోమవారం సాయంత్రం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా #AskKavitha హ్యాష్‌ట్యాగ్‌తో నెటిజన్లతో నేరుగా ముచ్చటించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు గంటసేపు జరిగిన ఈ ఇంటరాక్టివ్ సెషన్‌లో వందలాది ..మిగతా 2లో

# ముంబయిలో స్థానిక ఎన్నికలకు మోగిన నగారా

**28 కార్పొరేషన్లకు జనవరి 15న పోలింగ్**
**32 జిల్లా కౌన్సిళ్లు, 336 పంచాయతీ**
**సమితులకు ఒకే రోజు పోలింగ్**
**బీఎంసీ దేశంలోనే అతి పెద్ద కార్పొరేషన్**
**బడ్జెట్ పరంగా ఆసియాలోనే అతి పెద్దది**

02





# పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

**ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర**
**పేదలపై భారంగా కేంద్ర కొత్త బిల్లు**
**నిధుల కోతలతో గ్రామీణ పేదలకు దెబ్బ**
**నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : సీతక్క**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కుట్రకు తెరలేపిందని రాష్ట్ర మంత్రి సీతక్క తీవ్రంగా విమర్శించారు. పేదల జీవనాధారంగా ఉన్న ఈ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె ఆరోపించారు. ఉపాధి హామీ పథకం పేరుతో పాటు దాని ఆత్మను కూడా మార్చే ప్రయత్నం జరుగుతోందని సీతక్క తెలిపారు. పథకం పేరులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం అత్యంత దుర్మార్గమైన చర్యగా ఆమె అభివర్ణించారు. ఉపాధి హామీ పథకం పట్ల కేంద్రానికి మొదటి నుంచే విముఖత ఉన్నదని, 100 రోజుల ఉపాధి కల్పించాల్సిన ..మిగతా 2లో

# పంచాయతీ ఫలితాలు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

**బీఆర్ఎస్ విజయాలు అద్వితీయం**
**నిర్బంధాలను ఎదుర్కొని నిలబడ్డారు**
**కాంగ్రెస్ మంత్రులు ఊర్లలో బీఆర్ఎస్ సత్తా**
**అధికారపార్టీ కోటలు బీటలు వారింది**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణలో జరిగిన రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి హెచ్చరికగా మారాయని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా వేదికగా ..మిగతా 2లో

# మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం రద్దు

**కొత్త చట్టం తీసుకొచ్చిన కేంద్రం**
**పనిదినాల పెంతున్నామన్న ప్రభుత్వం**
**గాంధీ పేరు ఎందుకు తీసేశారంటూ విపక్షం ప్రశ్న**

**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**
గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించేందుకు 2005లో అమలులోకి వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త చట్టం పేరు 'వికసిత్ భారత్—గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్)'. ఈ బిల్లును ప్రస్తుత శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ..మిగతా లో



# ఇక ఇంటి నుండే యూరియా బుకింగ్




**ఈ రబీ సీజన్ నుండి ఎరువుల**
**పంపిణీ కోసం ప్రత్యేక మొబైల్ యాప్**
**రూపొందించిన వ్యవసాయశాఖ**
**ఈ నెల 20 నుండి ప్రయోగాత్మక అమలు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రైతులు యూరియా కోసం సమయాన్ని కేటాయించాల్సిన అవసరం లేకుండా, ఇంటి వద్ద నుంచే అవసరమైన యూరియాను ముందుగానే బుక్ చేసుకునే సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్ ను వ్యవసాయశాఖ తీసుకోస్తుంది. ఈ నెల 20 నుండి ఎరువుల మొబైల్ యాప్ ను ప్రయోగాత్మకంగా ..మిగతా 3లో

# పసిడి పరుగులు

**భారీగా పెరిగిన బంగారం ధరలు**
**తులం రూ.1,37,430కు**
**చేరుకున్న 24 క్యారెట్ల బంగారం ధర**
**వెండి ధరలు కూడా రికార్డు స్థాయిలోనే**
**కిలో రూ.1,96,948కు చేరుకున్న వెండి**

**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**
దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు మరోసారి భారీగా ఎగబాకాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో సోమవారం నాటికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,37, 430కి చేరి సరికొత్త గరిష్టాన్ని నమోదు చేసింది. గతంతో పోలిస్తే ఒక్కసారిగా జరిగిన ఈ పెరుగుదలతో బంగారం ..మిగతా 3లో



ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
16.12.2025
మంగళవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com



# బాలసుబ్రహ్మణ్యం అందరివాడు

మొదటిపేజీ తరువాయి

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావుతో పాటు పలువురు రాజకీయ, సాంస్కృతిక రంగ ప్రముఖులు హాజరై బాలుకి నివాళులు అర్పించారు.
తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్యేకంగా తయారు చేయించిన 7.2 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని రవీంద్రభారతి ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళాజీవితాన్ని ప్రతిబింబించేలా విగ్రహాన్ని రూపొందించారు. విగ్రహావిష్కరణ సందర్భంగా రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.
బాలసుబ్రహ్మణ్యంకు అత్యంత ఇష్టమైన 20 పాటలతో సాయంత్రం సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దాదాపు 50 మంది కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని బాలుగారి పాటలతో సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేయనున్నారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్నేహశీలి, మృదుస్వభావి అని పేర్కొన్నారు. ఇవాళ పరిపూర్ణ కళాకారుడిని గుర్తు చేసుకుంటున్నామని తెలిపారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గానం, సంగీతం, నటన సహా అనేక రంగాల్లో తన ప్రతిభను చాటారని చెప్పారు. ''తెలుగు పాటకు ఘంటసాల, ఎస్పీ బాలు పట్టం కట్టారు. సినీ చరిత్రలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. సంగీత దర్శకుడు ఏది కోరుకుంటాడో అదే ఇచ్చే అక్షయపాత్ర ఆయన గళం. గళంలో వైవిధ్యం చూపడం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రత్యేకత. ఆయన తెలుగు ఉచ్చారణ వింటుంటే ఎంతో ఆనందంగా ఉండేది. ఆయన హాస్యం, సమయస్ఫూర్తి అందర్నీ అలరించేవి. 'పాడుతా తీయగా' కార్యక్రమం ద్వారా వందలాది గాయకులను పరిచయం చేశారు'' అని వెంకయ్యనాయుడు గుర్తు చేసుకున్నారు.
హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ... ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ఏర్పాటు తెలుగు ప్రజలందరికీ గౌరవప్రదమని అన్నారు. ఎస్పీబీ కేవలం గాయకుడే కాకుండా సంగీత దర్శకుడు, నటుడిగా కూడా తన ముద్ర వేశారని పేర్కొన్నారు. పలు భాషల్లో 40 వేలకుపైగా పాటలు పాడి అరుదైన ఘనత సాధించారని తెలిపారు.
''ఘంటసాల తర్వాత అంతటి ఖ్యాతి సంపాదించిన గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. 'శంకరాభరణం' చిత్రంలోని 'శంకరా' పాట నా మనసుకు హత్తుకుంది. 'పుణ్యభూమి నా దేశం' పాట దేశభక్తిని చాటింది. 'అదిగో అల్లదిగో శ్రీహరివాసము' గీతం వింటే సాక్షాత్తూ వేంకటేశ్వరుడిని దర్శించిన భావన కలుగుతుంది. 'పాడుతా తీయగా' టీవీ కార్యక్రమం ద్వారా ఎంతోమంది గాయనీగాయకులకు వేదిక కల్పించారు'' అని బండారు దత్తాత్రేయ ప్రశంసించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమం కళాభిమానులకు భావోద్వేగాన్ని కలిగిస్తూ, ఆయన సంగీత వారసత్వాన్ని మరోసారి గుర్తు చేసింది.



# ముంబయిలో స్థానిక ఎన్నికలకు మోగిన నగారా

- **28 కార్పొరేషన్లకు జనవరి 15న పోలింగ్**
- **32 జిల్లా కౌన్సిళ్లు, 336 పంచాయతీ**
- **సమితులకు ఒకే రోజు పోలింగ్**
- **బీఎంసీ దేశంలోనే అతి పెద్ద కార్పొరేషన్**
- **బడ్జెట్ పరంగా ఆసియాలోనే అతి పెద్దది**



**ముంబయి, (ప్రజాస్వరం):**
ముంబయిలో స్థానిక ఎన్నికలకు నగరా మోగింది. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు 28 కార్పొరేషన్లకు జనవరి 15న పోలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అలాగే 32 జిల్లా కౌన్సిళ్లు, 336 పంచాయతీ సమితులకు ఒకే విడతలో ఓటింగ్ జరగనుంది. తర్వాత రోజు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించింది.
బీఎంసీతో పాటు పుణె, ఠాణె వంటి ప్రధాన జిల్లాలకు జరగనున్న ఈ స్థానిక ఎన్నికలను రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుంటాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వంపై ప్రజల మూడ్‌ను ఇవి తెలియజేస్తుంటాయని భావిస్తుంటారు. ఉద్ధవ్ ఠాక్రే శివసేన, కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్‌ను ఇవి నిర్ణయిస్తాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
బీఎంసీ దేశంలోనే అతి పెద్ద కార్పొరేషన్.. బడ్జెట్ పరంగా ఆసియాలోనే అతి పెద్దది. దేశంలోని పలు రాష్ట్రాల బడ్జెట్ విలువ కూడా ఈ స్థాయిలో ఉండదు. ముంబయి, పుణె, ఠాణె జిల్లాల్లో స్థానిక ఎన్నికలు 2022 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. ఓబీసీ రిజర్వేషన్లు, వార్డుల పునర్విభజనకు సంబంధించి నెలకొన్న వివాదాల కారణంగా ఈ ఎన్నికలు వాయిదా పడ్డాయి. పెండింగ్‌లో ఉన్న ఈ ఎన్నికలను జనవరి 31లోగా నిర్వహించాలని సుప్రీంకోర్టు డెడ్‌లైన్ విధించింది. ఈ క్రమంలోనే తాజా ప్రకటన వచ్చింది.

# 'ఓట్ చోరీ' కాంగ్రెస్ అజెండా

- **ఈ అంశంతో మాకు ఏ సంబంధం లేదు**
- **జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా**
- **ఇండియా కూటమిలో మొదలైన లుకలుకలు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
ఓట్ల చోరీ ఆరోపణలతో విపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న వేళ, ఈ అంశాన్ని కాంగ్రెస్ ప్రధాన రాజకీయ అస్త్రంగా మలచుకుంటోంది. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ అంశాన్ని ముందుకు తెచ్చి కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అయితే ఈ నేపథ్యంలో ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న ఎన్సీ నేత, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేసి రాజకీయ వర్గాల్లో చర్చకు తెరలేపారు.
ఓట్ల చోరీ అంశాన్ని కాంగ్రెస్ లేవనెత్తుతున్నప్పటికీ, దీనికి 'ఇండియా' కూటమికి ఎలాంటి సంబంధం లేదని ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు. ఓట్ల చోరీ ఆరోపణలు, ఎన్నికల్లో అక్రమాలపై స్పందిస్తూ... ''ఇండియా కూటమికి ఈ వ్యవహారంతో ఎటువంటి సంబంధం లేదు. ప్రతి పార్టీకి తన సొంత అజెండాను నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉంటుంది. ఓట్ల చోరీ అంశం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లను కాంగ్రెస్ తన ప్రధాన అంశాలుగా చేసుకుంది. ఏం చేయాలో వాళ్లకు మనం చెప్పలేం కదా!'' అని వ్యాఖ్యానించారు.
కాంగ్రెస్ దిల్లీలో 'ఓట్ చోర్... గద్దీ ఛోడ్' పేరుతో బహిరంగ సభ నిర్వహించిన మరుసటి రోజే ఒమర్ అబ్దుల్లా ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ సభలో కాంగ్రెస్ నేతలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే.
ఇదిలా ఉండగా, 'ఇండియా' కూటమి పరిస్థితి ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉన్నట్లేనని ఒమర్ అబ్దుల్లా ఇటీవల వ్యాఖ్యానించిన విషయం కూడా రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల విషయంలో విపక్ష కూటమి సమన్వయం లేకుండా, పట్టింపు లేనట్లుగా వ్యవహరించిందని ఆయన అప్పట్లో ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు విపక్ష కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నాయనే వాదనలకు బలం చేకూర్చాయి.
మరోవైపు, ఢిల్లీలో నిర్వహించిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ... కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కాంగ్రెస్ కంకణం కట్టుకుందని అన్నారు. సత్యం, అహింస మార్గంలోనే ఆ లక్ష్యాన్ని సాధిస్తామని చెప్పారు. ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని ఆరోపిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాటం కొనసాగుతుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.
ఓట్ల చోరీ అంశంపై కాంగ్రెస్ దూకుడు కొనసాగుతున్న వేళ, 'ఇండియా' కూటమి నేతల నుంచి వస్తున్న భిన్న స్వరాలు విపక్ష రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీస్తున్నాయి.

# పంచాయతీ ఫలితాలు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

మొదటిపేజీ తరువాయి

ఎక్స్‌లో స్పందించిన ఆయన... పల్లె ప్రజలు తమ ఓటు ద్వారా కాంగ్రెస్ పాలనకు కాలం చెల్లిందని స్పష్టంగా చెప్పారని అన్నారు.
రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు సాధించిన ఫలితాలు అద్వితీయమని పేర్కొన్న కేటీఆర్... గెలుపొందిన పార్టీ నేతలు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ సత్తా చాటడం విశేషమని అన్నారు. అధికార పార్టీ కోటలు బీటలు వారుతున్నాయనడానికి ఇవే నిదర్శనమని వ్యాఖ్యానించారు.
అడ్డదారిలో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఇక కాలం చెల్లిందని పల్లె ప్రజలు మరోసారి తేల్చిచెప్పారని కేటీఆర్ విమర్శించారు. పార్టీ గుర్తు లేని ఎన్నికల్లోనే కాంగ్రెస్ దుస్థితి ఇలా ఉంటే, పార్టీ గుర్తుతో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింత ఘోర పరాభవం తప్పదని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి రెండేళ్ల పరిపాలనలో ఎదురైన వైఫల్యాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీల అమలులో చేసిన మోసాలే కాంగ్రెస్‌కు ఉరితాళ్లుగా మారాయని కేటీఆర్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు.
అరాచక పాలనతో తెలంగాణ బతుకుచిత్రాన్ని ఛిద్రం చేస్తున్న రేవంత్ రెడ్డికి ఈ పంచాయతీ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టులాంటివని అన్నారు. నాడు బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ ఏకపక్షంగా విజయం సాధించిందని గుర్తుచేసిన కేటీఆర్... నేడు కాంగ్రెస్ సగం పంచాయతీలను కూడా గెలవలేకపోవడం ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతమని వ్యాఖ్యానించారు.
కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదు, రిక్తహస్తమని రెండేళ్ల పాలనలోనే తేలిపోయిందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ అసమర్థ పాలన కొనసాగితే, అసెంబ్లీ ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీ అడ్రస్ గల్లంతవడం ఖాయమని అన్నారు. రెండేళ్లుగా కాంగ్రెస్ సర్కారు చేస్తున్న అరాచకాలు, మోసాలు, అవినీతి కుంభకోణాలపై బీఆర్ఎస్ సాగిస్తున్న సమరానికి తెలంగాణ సమాజం మద్దతుగా నిలవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.
కష్టకాలంలో బీఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చిన కేటీఆర్... కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ కబంధహస్తాల నుంచి విడిపించే పోరాటాన్ని గులాబీ సైనికులు తమ భుజాలపై మోస్తున్నారని అన్నారు. అటువంటి కార్యకర్తలను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, వారి రాజకీయ భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తామని స్పష్టం చేశారు.



# 2029 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా?

మొదటిపేజీ తరువాయి

మంది నెటిజన్లు తమ ప్రశ్నలు, సూచనలు, అభిప్రాయాలను పంచుకున్నారు. కవిత వీటిలో కొన్నింటికి సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఓ నెటిజన్ 2029 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారా అని ప్రశ్నించగా, కవిత "అవును" అని స్పష్టంగా సమాధానమిచ్చారు. ఇది రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యమంత్రి అయితే ఏం చేస్తారనే ప్రశ్నకు "సామాజిక తెలంగాణ"ను లక్ష్యంగా చేసుకుని, యువత శక్తివంతం కావాలని, మహిళల హక్కులు, సామాజిక న్యాయం, ఉపాధి అవకాశాలపై దృష్టి పెడతానని వివరించారు. పిల్లల విద్యపై ఎటువంటి ఖర్చు లేకుండా ఉచిత, నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు అందించడం తన ప్రాధాన్యత అని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన కవిత, ఎన్నికల హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు నిరాశ చెందారని అన్నారు. నిరుద్యోగ సమస్యను దేశంలోనే అతిపెద్ద సవాలుగా పేర్కొన్నారు. యువత ఆకాంక్షలు "ఉద్యోగాలు, ఉద్యోగాలు, ఉద్యోగాలు" అని సారాంశం చేశారు.
తెలంగాణ జాగృతి సంస్థను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని, ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేసి సామాజిక, సాంస్కృతిక అంశాలపై క్రమంగా పనిచేస్తామని ప్రకటించారు. కొత్త పార్టీ పేరు సూచించమని నెటిజన్లను కోరారు.



అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సంబంధించిన ప్రశ్నలను ఆమె పక్కన పెట్టారు. గతంలో బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన నేపథ్యంలో ఈ సెషన్ మరింత ఆసక్తికరంగా మారింది. తన రాజకీయ భవిష్యత్తును స్వతంత్రంగా రూపొందిస్తున్నట్లు కవిత సంకేతాలు ఇచ్చారు. ఈ ప్రకటనతో 2029 ఎన్నికలకు ముందు తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పులు రావచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ #AskKavitha సెషన్ ద్వారా కవిత ప్రజలతో నేరుగా కనెక్ట్ అవుతూ, తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# సుమీత్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఎంఎండిఐ ఫ్యూషన్ విజయం

- **సుమీత్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్**

**చర్లపల్లి డిసెంబర్ 14(ప్రజాస్వరం):**
అజీజ్ నగర్ ది పెవిలియన్ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన యఫ్ టిసిసిఐ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో ఎంఎండిఐ ఫ్యూషన్ లేవన్ జట్టు, ఎంపిఎల్ జట్టుపై ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఎంఎండిఐ ఫ్యూషన్ తరపున సుమీత్ అద్భుతంగా ఆడాడు. కేవలం 27 బంతుల్లోనే 17 ఫోర్లతో 74 పరుగులు సాధించి జట్టును విజయపథంలో నడిపించాడు. అతడి విశేష ప్రదర్శనకు గాను సుమీత్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. సుమీత్ దూకుడు బ్యాటింగ్‌తో ప్రేక్షకులను ఉత్సాహపరిచింది. దానితో పాటు, ఆ జట్టు బౌలింగ్ మరియు ఫీల్డింగ్‌లో గొప్ప ప్రదర్శనను కనబరిచింది. మరియు ఎంపిఎల్ ని 88 పరుగులకే పరిమితం చేసి మ్యాచ్ గెలిచింది.



# పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని అన్నారు.మోడీ ప్రభుత్వం ఏ ఏడాదీ 42 రోజుల కన్నా ఎక్కువ పని దినాలు కల్పించలేదని సీతక్క ఆరోపించారు.ఉపాధి హామీ నిధుల్లో భారీ కోతలు విధించడం వల్ల పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని,కేంద్రం తన వాటాను 60 శాతానికి మాత్రమే పరిమితం చేసి, మిగిలిన 40 శాతం భారం రాష్ట్రాలపై మోపుతోందని విమర్శించారు. దీని వల్ల రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం పడుతోందన్నారు. సెస్‌లు, సర్‌చార్జీల పేరుతో రాష్ట్రాలకు రావాల్సిన నిధులను కేంద్రం కబళిస్తోందని ఆరోపించారు. ఈ విధానం సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని పూర్తి నిధులతో కేంద్ర ప్రభుత్వమే అమలు చేయాలని, పేదల జీవన భద్రతను కాపాడాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.



# ముగిసిన మూడో విడత ప్రచారం

- **రేపు 182 మండలాల్లో3752 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు**
- **ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రాష్ట్రంలో మూడో విడత ఎన్నికల ప్రచారం సోమవారం ముగిసింది. డప్పులు, మైకుల మోత.. నినాదాలు ప్రచారంతో దద్దరిల్లిన పల్లెలు.. ఒక్కసారిగా మూగబోయినట్లయింది. పోలింగ్కు ఒక్కరోజు మాత్రమే గడువు ఉండడంతో పోటీ చేసే అభ్యర్థులు ఇల్లులు జరుగుతూ తమకు ఓటు వేయాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. గెలుపే లక్ష్యంగా పక్కా ప్లాన్‌తో ముందుకు సాగుతున్నారు. అధికారులు పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. చివరి విడత( మూడవ విడత) పంచాయతీ ఎన్నికలు ఈ నెల 17న జరగనున్నయి. 152 మండలాల్లోని ఎన్నికల సంఘం 4,157 పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వగా.. 11 సర్పంచ్ పదవులకు, 36,434 వార్డుల్లో 112 చోట్ల నామినేషన్లు దాఖలు కాలేదని అధికారులు ప్రకటించారు. 394 సర్పంచ్ స్థానాలు, 7,916 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో మిగిలిన 3,752 సర్పంచ్ స్థానాలకు 13,128 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇక మిగిలిన 28,406 వార్డులకు 75,283 మంది పోటీ పడుతున్నారు. రెండు విడతల్లో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని పైసలు తీసుకొని.. వేరేవారికి ఓటేస్తే ఎలా..? అనే అనుమానం లీడర్లలో వెంటాడుతుంది. దీంతో మూడో విడతలో నమ్మకమైన ఓటర్లకే పైసలు పంపిణీ చేయాలనే వ్యూహంతో వెళ్తున్నారు. యూత్, మహిళా ఓటర్లను టార్గెట్ చేసి వారికే తాయిలాలు ఇస్తున్నట్లు సమాచారం. కుల సంఘాల పెద్దలను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న గ్రామస్థులకు ఫోన్లు చేసి, వచ్చి ఓటేసి పోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బస్సు చార్జీలతో పాటు ప్రత్యేక వాహనాలు ఏర్పాటుచేసి ఓటుకు ఇంత చొప్పున ఆన్‌లైన్‌లో పంపిస్తున్నారు.
ఎన్నికల అధికారులు ఏర్పాట్లలో బిజీ అయ్యారు. మూడో విడత పోలింగ్ జరగనున్న కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.



# పసిడి పరుగులు



**మొదటిపేజీ తరువాయి**

ధరలు చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరినట్లయ్యాయి. అదే సమయంలో 10 గ్రాముల 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా రూ.1,25,850 వద్ద కొనసాగుతోంది. బంగారం బాటలోనే వెండి ధరలు కూడా రికార్డు స్థాయికి చేరాయి. దేశీయ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,96,948కి పెరిగింది. కొద్ది రోజులుగా వెండి ధరల్లో కొనసాగుతున్న ఎగబాకుడు ఇప్పుడు మరింత వేగం పుంజుకోవడంతో పెట్టుబడిదారుల్లో ఆసక్తి పెరుగుతోంది. దేశీయంగా బంగారం, వెండి ధరలు పెరగడానికి అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలే ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,340 డాలర్లకు చేరగా, ఔన్సు వెండి ధర 63 డాలర్లకు పైగా ట్రేడవుతోంది. ఈ స్థాయిలు గతంలో ఎన్నడూ లేని విధంగా ఉండటం విశేషం.

అమెరికా డాలర్ బలహీనపడటం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల విధానాలపై కొనసాగుతున్న అనిశ్చితి విలువైన లోహాల ధరలపై ప్రభావం చూపుతున్నాయని బులియన్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. వడ్డీ రేట్లపై స్పష్టత లేకపోవడం, భవిష్యత్ ఆర్థిక పరిస్థితులపై ఆందోళనలు పెరగడంతో పెట్టుబడిదారులు భద్రమైన పెట్టుబడులుగా భావించే బంగారం, వెండిపై మొగ్గు చూపుతున్నారని తెలిపారు.

ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా అనేక కేంద్ర బ్యాంకులు బంగారాన్ని భారీగా కొనుగోలు చేయడం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోంది. గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెరగడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతుండటం వంటి అంశాలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. ఈ అన్ని పరిణామాల నేపథ్యంలో విలువైన లోహాల ధరలు సమీప భవిష్యత్తులో కూడా హెచ్చుతగ్గులతో కొనసాగవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఇక ఇంటి నుండే యూరియా బుకింగ్



**మొదటిపేజీ తరువాయి**

అమలు చేయాలని నిర్ణయించింది.

రైతులు ఎరువుల కోసం వారి విలువైన సమయాన్ని వృధా చేయకుండా ఉండేందుకు వ్యవసయశాఖ కేవలం ఎరువుల పంపిణీ కోసం ఒక కొత్త మొబైల్ యాప్ ను తీసుకువస్తుంది. ఈ యాప్ ద్వారా రైతులు తమకు సమీపంలోని డీలర్ వద్దతో పాటు జిల్లా పరిధిలోని ఇతర డీలర్ల వద్ద ఉన్న యూరియా స్టాక్ లభ్యతను తెలుసుకోవచ్చు. రైతు తన పంటలకు అవసరమైన యూరియా పరిమాణాన్ని, తనకు అనుకూలమైన ఏ డీలర్ వద్ద నుంచైనా ముందుగా బుక్ చేసి కొనుగోలు చేసుకునే అవకాశం ఈ యాప్ ద్వారా లభించనుందని అన్నారు. అవసరమైతే, యూరియా బుకింగ్ కోసం రైతులు తమ పరిధిలోని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) సేవలను కూడా వినియోగించుకోవొచ్చు.

యూరియా బుక్ చేసిన అనంతరం రైతుకు ఒక బుకింగ్ ఐడి (Booking ID) లభిస్తుంది. ఆ బుకింగ్ ఐడి ఆధారంగా, రైతు తాను ఎంపిక చేసిన డీలర్ వద్ద నుంచి యూరియాను కొనుగోలు చేయవచ్చు. సంబంధిత డీలర్, రైతు లేదా అతని ప్రతినిధి వద్ద ఉన్న బుకింగ్ ఐడి, బుక్ చేసిన పరిమాణాన్ని ధృవీకరించిన తరువాతే యూరియాను విక్రయించాలి.

బుకింగ్ సమయంలో రైతు కేవలం పంట పేరు మరియు ఆ పంట సాగు విస్తీర్ణం నమోదు చేయడం ద్వారా సరిపోతుంది. నమోదు చేసిన వివరాల ఆధారంగా, వ్యవస్థ స్వయంచాలకంగా రైతుకు అర్హమైన మొత్తం యూరియా పరిమాణాన్ని ఏ ఏ వ్యవధుల్లో బుక్ చేసుకోవచ్చో లెక్కిస్తుంది. రైతుల సౌకర్యార్థం, ఏవైనా సమస్యలు ఎదురైతే పరిష్కరించేందుకు హెల్ప్‌లైన్ నంబర్లతో కూడిన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ కూడా అందుబాటులో ఉంచనున్నారు.

అధికారులందరూ సంబంధిత వర్గాలకు యాప్ గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, యాప్‌ను అమలలోకి తీసుకురానున్నారు. యూరియా పక్కదారి పట్టకుండా, పంట పండించే రైతులకు మాత్రమే యూరియా అందించాలనే లక్ష్యంతో ఈ యాప్ ని రైతుల ముందకు తీసుకురాబోతున్నరు. దేశంలోనే యూరియాని అధికంగా వినియోగిస్తున్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఒకటని, రైతులకు యూరియా వాడకం వలన కలిగే నష్టాలను వివరించి, యూరియా వినియోగం తగ్గించాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలని, అందుకోసం అధికారులు విస్తృత పర్యటనలు చేసి, రైతులకు అవగాహన కల్పించనున్నారు.

**యాప్ లోని ప్రత్యేకతలు:**

- రైతులు/ సిటిజన్, డిపార్ట్ మెంట్ మరియు డీలర్ల కోసం వేర్వేరు లాగిన్లు
- మొబైల్ నెంబర్, ఒటిపి ద్వారా లాగిన్ అయ్యే అవకాశం
- లాగిన్ అవ్వగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని బస్తాల యూరియా అందుబాటులో ఉందో కనిపిస్తుంది
- లాగిన్ అయిన రైతులు తమ జిల్లాను ఎంపిక చేయగానే ఆ జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియా బ్యాగులు కనిపిస్తాయి.
- తరువాత సీజన్ ను, వారి పాస్ బుక్ నెంబర్, వారు ఎన్ని ఎకరాలలో పంట వేస్తున్నారో, ఏఏ పంటను వేస్తున్నారో ఎంటర్ చేయాలి.
- వారు సాగు చేసే ఎకరాలను బట్టి వారికి అవసరమయ్యే యూరియా బ్యాగులు యాప్ లో కనిపిస్తాయి. అయితే వారు సాగు చేసే విస్తీర్ణాన్ని బట్టి వారికి అవసరమయ్యే యూరియా బస్తాలను 15 రోజుల వ్యవధితో 1 నుండి 4 దశలలో అందచేసేలా వివరాలు కనిపిస్తాయి.
- పాస్ బుక్ లు లేని రైతులు వారి పట్టా పాస్ బుక్ దగ్గర ఆధార్ సెలెక్ట్ చేసుకొని, ఆధార్ నెంబర్ ఎంటర్ చేసి, ఒటిపి కన్ఫర్మేషన్ తరువాత వారు పై వివరాలను నింపాలి.
- కౌలు రైతులు కూడా వారి పేరు, తండ్రిపేరు మరియు ఆధార్ నెంబర్ ఎంటర్ చేసి, ఒటిపి కన్ఫార్మేషన్ తరువాత భూ యజమాని పట్టా పాస్ బుక్ నెంబర్ ఎంటర్ చేస్తే, యజమాని మొబైల్ నెంబర్ తో ఒటిపి వ్యాలిడేషన్ తరువాత కౌలు రైతులు కూడా తమ వివరాలు ఎంటర్ చేసేలా ఈ యాప్ లో అవకాశం కల్పించడం జరిగింది.
- ఇక, డీలర్లు వారి మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయి, వారు రోజువారిగా వారికి వచ్చిన స్టాక్ మరియు అమ్మకం వివరాలను నింపాల్సి ఉంటుంది.

# మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం రద్దు

**మొదటిపేజీ తరువాయి**

(డిసెంబర్ 2025) లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ మార్పు 'వికసిత్ భారత్ 2047' దృష్టికి అనుగుణంగా గ్రామీణ అభివృద్ధి, ఉపాధి సృష్టిని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చరిత్ర ఇదే..**

2005లో యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను 2009 అక్టోబర్ 2 నుంచి మహాత్మా గాంధీ పేరుతో ఎంజీఎన్ఆర్ఈజీఏగా మార్చారు. ఈ చట్టం ప్రకారం ప్రతి గ్రామీణ నిరుపేద కుటుంబానికి ఏటా కనీసం 100 రోజుల ఉపాధి హక్కు ఉంది. నైపుణ్యం లేని మాన్యువల్ పనులకు వేతనం చెల్లిస్తారు. గత రెండు దశాబ్దాలుగా ఈ పథకం గ్రామీణ పేదలకు భద్రత కల్పించింది. అయితే, 2022లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ నివేదిక ప్రకారం 202425 ఆర్థిక సంవత్సరంలో సగటున ప్రతి కుటుంబం కేవలం 50 రోజుల ఉపాధి మాత్రమే పొందింది. కేవలం 40.7 లక్షల కుటుంబాలు మాత్రమే 100 పూర్తి రోజులు పని చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంకా తక్కువ - కేవలం 6.74 లక్షల కుటుంబాలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలు గతంలో 100 రోజులకు మించి ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాయి. గతేడాది కొన్ని రాష్ట్రాలు సొంత బడ్జెట్‌తో రూ.4.35 కోట్లు ఖర్చు చేసి అదనపు పని దినాలు సృష్టించాయి. మహారాష్ట్ర, ఒడిశా, కేరళ, తెలంగాణ వంటి రాష్ట్రాలు సొంత వనరులతో ఎక్కువ ఉపాధి కల్పించగలిగాయి.

**కొత్త బిల్లులో ముఖ్య మార్పులు**

కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును లోక్‌సభ సభ్యులకు పంపిణీ చేసింది. ఆమోదం పొందితే పాత చట్టం రద్దై, కొత్త చట్టం అమలులోకి వస్తుంది. ఇందులోని ముఖ్య మార్పులు ఇవే.. గతంలో 100 రోజులు ఉండగా, ఇప్పుడు 125 రోజులకు పెంచారు. ఇది గ్రామీణ కుటుంబాలకు మరింత ఆదాయ భద్రత కల్పిస్తుంది.

పంటల టాప్ సీజన్‌లో (సుమారు 60 రోజులు) పనులు నిలిపివేయవచ్చు. ఇది వ్యవసాయ కూలీల లభ్యతను భద్రపరుస్తుంది, కానీ 125 రోజులు పూర్తి చేసే సమయం తగ్గుతుంది. నిధుల భాగస్వామ్యం MGNREGAలో వేతనాలు పూర్తిగా కేంద్రం భరిస్తుంది. కొత్త బిల్లులో రాష్ట్రాలు 40% వాటా భరించాలి. ఇది



రాష్ట్రాలపై ఆర్థిక భారం పెంచుతుంది.

కేటాయింపులు డిమాండ్ ఆధారితం కాకుండా, కేంద్రం నిర్ణయించే 'నార్మేటివ్ అలాకేషన్' ఆధారంగా నిధులు. అదనపు ఖర్చు రాష్ట్రాలదే. ప్రాధాన్యతలు నీటి భద్రత, గ్రామీణ మౌలిక సదుపాయాలు, జీవనోపాధి సంబంధిత పనులు, వాతావరణ మార్పులకు తట్టుకునే ప్రాజెక్టులపై దృష్టి. పనులు 'వికసిత్ భారత్ నేషనల్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టాక్'లో భాగమవుతాయి. సాంకేతికత మొబైల్ అటెండెన్స్, ఆధార్ పేమెంట్స్, జియోట్యాగింగ్ వంటివి చట్టబద్ధం చేశారు.

కాంగ్రెస్ నేత ప్రియంక గాంధీ వాద్రా మహాత్మా గాంధీ పేరు తొలగించడం ద్వారా ప్రభుత్వం గాంధీజీ పట్ల ద్వేషం చూపిస్తోందని విమర్శించారు. హక్కు ఆధారిత చట్టాన్ని రద్దు చేసి, కేంద్ర నియంత్రణ పెంచడం, రాష్ట్రాలపై భారం మోపడం తప్పని ఆరోపిస్తున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మార్పులకు అనుగుణంగా, మరింత ఆధునికీకరణ, పారదర్శకత కల్పించడమే లక్ష్యం. ఈ మార్పులతో గ్రామీణ భారత్ మరింత సమృద్ధిగా, స్థిరంగా మారే అవకాశం ఉంది. అయితే, బిల్లు ఆమోదం పొందితేనే అమలు ప్రారంభమవుతుంది.

## ప్రత్యేక డివిజన్ హోదా కోసం
# జమ్మిగడ్డ వాసుల పోరాటం

- రెండవ రోజు రిలే నిరాహార దీక్షకు వివిధ పార్టీల నేతల మద్దతు

**కాప్రా, డిసెంబర్ 14(ప్రజాస్వరం):**

జమ్మిగడ్డను ప్రత్యేక డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జమ్మిగడ్డ వాసులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండవ రోజుకు చేరుకుంది. జమ్మిగడ్డ సాధన సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ దీక్షకు ప్రజలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు భారీగా మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న జమ్మిగడ్డ సాధన సమితి సభ్యులను మాజీ కార్పొరేటర్ పజ్జురి పావని రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్, మేడ్చల్ జిల్లా ఎస్ఎస్ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్, బీజేపీ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కనుకుల రజనీకాంత్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి సంఘీభావం తెలిపారు. నేతలు మాట్లాడుతూ, జమ్మిగడ్డ సాధన సమితి చేపట్టిన న్యాయమైన పోరాటానికి తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జమ్మిగడ్డను ప్రత్యేక డివిజన్‌గా ప్రకటించే వరకు ఈ ఉద్యమం కొనసాగాలని వారు సూచించారు. ఈ సందర్భంగా దీక్షకారులు మాట్లాడుతూ, జమ్మిగడ్డ ప్రాంతంలో ప్రస్తుతం 20 వేలకుపైగా ఓటర్లు ఉండగా, దాదాపు 40 వేల మంది జనాభా నివసిస్తున్నారని తెలిపారు. ఇంత పెద్ద జనాభా ఉన్నప్పటికీ, ఇప్పటికీ మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, త్రాగునీరు, రహదారులు, పరిపాలనా సేవలు సరైన స్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక డివిజన్‌గా ప్రకటిస్తే మాత్రమే జమ్మిగడ్డ ప్రాంతానికి సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జమ్మిగడ్డను ప్రత్యేక డివిజన్‌గా ప్రకటించాలని దీక్షకారులు డిమాండ్ చేశారు.







# వనపర్తి జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

- 87 శాతం పోలింగ్ నమోదు.... జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.

**వనపర్తి, డిసెంబర్ 14(ప్రజాస్వరం):**

వనపర్తి జిల్లాలో రెండో విడతగా నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింత, మదనాపూర్ మండలాల్లో జరిగిన పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పూర్తయినట్లు చెప్పారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 1 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ సరళిని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, సాధారణ ఎన్నికల పరిశీలకులు మల్లయ్య భట్టు, వ్యయ పరిశీలకులు శ్రీనివాస్‌తో కలిసి పర్యవేక్షించారు. అలాగే వనపర్తి మండలంలోని నాచహళ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంతో పాటు పెద్దగూడెం గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించి పోలింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నాచహళ్లి గ్రామంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు గేట్లు మూసి, క్యూ లైన్లలో ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. శాంతిభద్రతలను పోలీస్ శాఖ సమర్థవంతంగా అమలు చేసినట్లు చెప్పారు. రెండో విడతలో పోలింగ్ జరిగిన వనపర్తి, కొత్తకోట, మదనాపూర్, ఆత్మకూరు, అమరచింత మండలాల్లో మొత్తం 1,03,406 ఓట్లు పోలవగా, 87 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్య నాయక్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.




# మానవత్వం చాటుకున్న కళ్యాణపురం ఎస్సీ కాలనీ యూత్


- 5000 ఆర్థిక సహాయం

**బూర్గంపాడు డిసెంబర్ 14(ప్రజాస్వరం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కళ్యాణపురం గ్రామానికి చెందిన యడవెల్లి రాజేష్(దావీదు) వెన్నెల దంపతుల కుమారుడు, వయస్సు 4 నెలలు, బాబు కి గత వారం రోజుల నుంచి ప్లీహం యొక్క పరిమాణం పెరిగి(ఉబ్బి) కామెర్లు విపరీతంగా పెరిగాయి, ముందుగా మణుగూరు లోని పిల్లల హాస్పిటల్ లో చికిత్స అందించారు, పరిస్థితి విషమం గా మారడం తో డాక్టర్ సలహా మేరకు హైద్రాబాద్ లోని నిలోఫర్ హాస్పిటల్ కి తీసుకువెళ్ళి చికిత్స అందిస్తున్నారు ,నిరుపేద కుటుంబానికి చెందిన వీరి ఆర్థిక పరిస్థితికి ఆ బాబుకి వైద్యం అందించడం కష్టంగా మారింది, దయగల దాతలు ఫోన్ పే నంబర్ 8143739533(వెన్నెల) నంబర్ కి మీయొక్క విరాళం అందించి ఈ చిరు ప్రాణాన్ని కాపాడగలరని కోరుకుంటున్నాం అని తెలిపారు.








# నూతన వార్డు మెంబర్లని సత్కరించిన మాజీ జడ్పీటీసీ

**బూర్గంపాడు డిసెంబర్ 14(ప్రజాస్వరం)**

బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామ పంచాయతీలో బి ఆర్ యస్ పార్టీ తరుపున పోటీ చేసి గెలిచిన కొనకంచి బసంతి దేవి తిరుపతి ఏసుబు, పాటి అశోక్, బోళ్ల ఉమా w/o పంగి సురేష్, నలుగురు వార్డ్ మెంబర్లని శాలువాతో ఘనంగా సత్కరించి, స్వీట్స్ పంచి శుభాకాంక్షలు తెలియజేసిన బూర్గంపహాడ్ మండల మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, వారితో పాటు బి ఆర్ యస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, టౌన్ అధ్యక్షులు కొనకంచి శ్రీను, టౌన్ యూత్ అధ్యక్షులు సోము లక్ష్మి చైతన్య రెడ్డి, తాళ్లగొమ్మూరు సర్పంచ్ గుమ్మడి కృష్ణ వేణి, వార్డు మెంబర్ జ్యోతి పూర్ణ చందర్, దంపతులు, వెంకటరమణ, బి ఆర్ యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



# ఏందిరో ఎట్లా గా ఉంది...?

- **ఓ సర్పంచ్ అభ్యర్థి..**
- **గెలిచేందుకు రూ.17 కోట్ల వరకు ఖర్చు!**
- **ఒక్కో ఓటరుకు రూ.40 వేలు!**
- **మహిళలకు చిన్న చిన్న వెండి బంగారు ఆభరణాల బహుకరుణ!**

**తెలంగాణ బ్యూరో డిసెంబర్ 14(ప్రజాస్వరం):**

తెలంగాణలో రెండో విడత పంచాయతీ పంచాయతీ ఎన్నికల పోలింగ్ పూర్తి అయింది. ఇక చివరి విడత ఈనెల 17వ తేదీన జరగనుంది. ఈసారి సర్పంచ్ ఎన్నికల్లో జోరుగా మద్యం, డబ్బు సరఫరా జరుగుతోంది. ఎన్నికల అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా.. ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలను మాత్రం అడ్డుకోలేక పోతున్నారు. ఇంటింటికీ వెళ్లి డబ్బు, మద్యం సరఫరా చేస్తూ.. సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులు.. ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు మరింత ముమ్మరం చేస్తున్నారు. ఇక పోలింగ్‌కు ముందు రోజు.. భారీగా డబ్బులు చేతులు మారుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా రెండో విడత ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఓ సర్పంచ్ అభ్యర్థి.. ఏకంగా రూ.17 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. ఓటుకు రూ.40 వేల చొప్పున పంచినట్లు తెలుస్తోంది.

**అభ్యర్థి గ్రామంలో..**

సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఓ సంఘటన ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పటాన్‌చెరు మండలానికి చెందిన ఓ గ్రామంలో.. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా గెలిచిన ఓ సర్పంచ్ అభ్యర్థి.. గెలిచేందుకు రూ.17 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు వార్తలు రావడం పెను సంచలనంగా మారింది. ఆ అభ్యర్థి.. గ్రామంలోని ఓటర్లందరికీ.. మూడు విడతల్లో డబ్బులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఇలా మూడు సార్లు కలిపి.. ఒక్కో ఓటరుకు రూ.40 వేల చొప్పున ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు.. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న రంగారెడ్డి జిల్లాలోనూ ధన ప్రవాహం జోరుగా సాగినట్లు తెలుస్తోంది. పలు మేజర్ గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసిన అభ్యర్థులు సగటున రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఖర్చు పెట్టినట్లు సమాచారం. చేవెళ్ల డివిజన్‌లోని చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల్లో తక్కువలో తక్కువగా ఒక్కో ఓటుకు.. రూ.3 వేల నుంచి అత్యధికంగా.. రూ.15 వేల వరకు ఇచ్చినట్లు తెలుస్తోంది.



## కుషాయిగూడ డివిజన్‌గా పేరు మార్చాలంటూ ఉద్యమం




- **పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం పదహారవ డివిజన్‌లోకి మార్చాలని డిమాండ్**
- **కుషాయిగూడలో మహా ధర్నా**

**కుషాయిగూడ డిసెంబర్ 14(ప్రజాస్వరం):**

కాప్రా సర్కిల్ పదహారవ డివిజన్‌కు 'కుషాయిగూడ' అనే పేరు పెట్టడంతో పాటు, కుషాయిగూడ గ్రామ హక్కుగా ఉన్న శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని అధికారికంగా పదహారవ డివిజన్ కుషాయిగూడ పరిధిలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కుషాయిగూడ బస్ స్టాప్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి కుషాయిగూడకు మద్దతుగా నాగార్జున నగర్ కాలనీ, వైష్ణవి ఎన్‌క్లేవ్ కాలనీ, సాయి నగర్, కృష్ణారెడ్డి నగర్, హనుమాన్ నగర్, భాగ్యనగర్, వి.ఎన్.రెడ్డి కాలనీ, సోనియా గాంధీ నగర్, సాయి వెంకట ఎన్‌క్లేవ్, శివ సాయి నగర్, మీనాక్షి నగర్, లక్ష్మీ నర్సింహా కాలనీ, పద్మావతి కాలనీ, శుభోదయ కాలనీ తదితర కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు. అలాగే కుషాయిగూడ వ్యాపార సంఘాల ప్రతినిధులు, కుషాయిగూడ మార్కెట్ సభ్యులు, కంత వ్యాపారులు, కుషాయిగూడ యువత భారీ సంఖ్యలో ధర్నాలో పాల్గొని తమ డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వివిధ కాలనీల ప్రతినిధులు మాట్లాడుతూ, చారిత్రక గుర్తింపు కలిగిన కుషాయిగూడ పేరును పదహారవ డివిజన్‌కు ప్రకటించాలని, అలాగే కుషాయిగూడ గ్రామ హక్కుగా ఉన్న శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని అధికారికంగా పదహారవ డివిజన్ కుషాయిగూడ పరిధిలోకి మార్చాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు మద్దతు తెలిపిన అన్ని కాలనీల సభ్యులకు కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## ప్రొద్దుటూరు సర్పంచ్ గా బండ లక్ష్మీ, నర్సింహా ఘన విజయం

- **241 ఓట్ల మెజార్టీతో నన్ను గెలిపించిన నా వార్డు ప్రజలకు కృతజ్ఞతలు**

**శంకర్ పల్లి డిసెంబర్ 14(ప్రజాస్వరం):**

రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం ప్రొద్దుటూరు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పోటీ చేసిన బండ లక్ష్మీ, నర్సింహా 241 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ప్రజల విశ్వాసం మద్దతుతో స్పష్టమైన ఆధిక్యంతో గెలుపొందిన ఆయనకు వార్డు ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో గ్రామ అభివృద్ధి మౌలిక వసతుల మెరుగుదల ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతానని లక్ష్మి, నర్సింహా హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు పారిశుధ్యం తాగునీరు రహదారుల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. విజయం అనంతరం ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఓటు వేసిన ప్రతి ఓటరికి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి కోసం ప్రజలతో కలిసి పనిచేస్తానని అందరి సహకారంతో ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలు అభిమానులు బండ లక్ష్మీ, నర్సింహా ను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



## ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి దంపతులు.

**వనపర్తి, డిసెంబర్ 14(ప్రజాస్వరం):**

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి సొంత గ్రామం కానాయపల్లి లో రెండవ విడతలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికలలో మాజీ పార్లమెంట్ సభ్యులు, వనపర్తి మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఆయన సతీమణి రావుల వరలక్ష్మి ఆదివారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే వారు గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఓటు వేసిన అనంతరం వారు ప్రజలతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా రావుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది. గ్రామాభివృద్ధికి సరైన నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఇదే. ప్రతి ఒక్కరూ ఎలాంటి భయాలు, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించాలి. ఓటింగ్ శాతం పెరిగితేనే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుంది" అని అన్నారు. గ్రామాభివృద్ధి, పారదర్శక పాలన కోసం అర్హులైన వారిని ఎన్నుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వారి వెంట కానాయపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పోతులపల్లి యాదయ్య సాగర్, వాకిటి నరసింహ, కొత్తకోట బాలయ్య నాయుడు, గ్రామ ప్రజలు ఉన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు ప్రశాంతంగా, క్రమబద్ధంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు.



## మేఘన్న అభయహస్తం ద్వారా మృతుడి కుటుంబానికి అండగా ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి, డిసెంబర్ 14(ప్రజాస్వరం):**


వనపర్తి జిల్లా కేంద్రంలోని రాయిగడ్డ-1వ వార్డుకు చెందిన పెబ్బేటి మన్యం ఇటీవల మృతిచెందగా, ఆయన కుటుంబానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి రూ.5,000 ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. మృతుడి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న స్థానిక నాయకులు, మాజీ కౌన్సిలర్ చుక్క రాజు ఈ విషయాన్ని ఎమ్మెల్యేకు తెలియజేయగా, ఆయన ఆదేశాల మేరకు నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ ద్వారా ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోయ మురళి, జక్కుల నాగరాజు, ఉందే కోటి రమేష్, ఆర్‌టీ కిరణ్, నాగులపల్లి రాము, గౌనికాడి మన్యం, జక్కుల మహేష్, మోహన్ రాజు, భాస్కర్, చింటూ తదితరులు పాల్గొని మృతుడికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములుగా నిలవడమే కాంగ్రెస్ పార్టీ విధానమని, ఇటువంటి విషాద సందర్భాల్లో పార్టీ నాయకత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



## కమలుద్దీన్‌పూర్ సర్పంచ్ గోపాల్ యాదవ్, ఉపసర్పంచ్ చెన్నయ్య కాంగ్రెస్‌లో చేరిక

**వనపర్తి, డిసెంబరు 15(ప్రజాస్వరం):**

ఖిల్లా ఘణపురం మండలం కమలుద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన సర్పంచ్ గోపాల్ యాదవ్, ఉపసర్పంచ్ చెన్నయ్య సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన గోపాల్ యాదవ్‌తో పాటు ఉపసర్పంచ్‌గా ఎన్నికైన చెన్నయ్యలను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో బరిలో నిలిచి సర్పంచ్‌గా గెలుపొందడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో కలిసి నడుచుకుంటూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా సర్పంచ్ గోపాల్ యాదవ్, ఉపసర్పంచ్ చెన్నయ్యలతో పాటు వార్డు సభ్యులు మధు, దాసు గౌడ్, మొగులయ్య, నరసమ్మ, లక్ష్మమ్మలను కూడా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిన్నారెడ్డి, రామకృష్ణ, రాములు, దామోదర్ గౌడ్, రాఘవేందర్ గౌడ్, సత్యం గౌడ్, మహమ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.




## సెల్ టవర్ ఎక్కిన సర్పంచ్ అభ్యర్థి

**హైదరాబాద్ డిసెంబర్ 14(ప్రజాస్వరం):**

తన ప్రత్యర్థి ఓటర్లకు డబ్బులు పంచుతున్నా, దాన్ని అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైందని ఆగ్రహించిన ఒక సర్పంచ్ అభ్యర్థి ఆదివారం తెల్లవారుజామున నార్సింగి మండలం నర్సంపల్లి పెద్ద తాండాలో ఉన్న సెల్ టవర్ ఎక్కాడు. పోలింగ్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ, పోటీదారుడైన శంకర్ నాయక్ తన ప్రత్యర్థి ఓటుకు రూ. 2,000 పంపిణీ చేసి లబ్ధి పొందుతున్నాడని ఆరోపించారు. ఎన్నికల ప్రచార సమయంలో తన ప్రత్యర్థి అక్రమాలకు పాల్పడుతున్నా, అధికారులు అతడిని ఆపడంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. ప్రచార కార్యక్రమాలపై ఆంక్షలు అమల్లో ఉన్నప్పటికీ, తన ప్రత్యర్థి ఓటర్లను ప్రలోభపెట్టడానికి ఇంటింటికీ తిరిగి డబ్బులు పంపిణీ చేశాడని నాయక్ ఆరోపించారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, సెల్ టవర్ పైనుంచి కిందకు దిగమని అతడిని ఒప్పించారు.






## నూతన వార్డ్ మెంబర్లని సత్కరించిన మాజీ జడ్పీటీసీ

**బూర్గంపహాడ్ డిసెంబర్ 15(ప్రజాస్వరం):**

బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామ పంచాయతీలో ఈ నెల 11న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరుపున పోటీ చేసి గెలిచిన వరాల రామకృష్ణ, పూజారి శ్రీదేవి ఇద్దరు వార్డు మెంబర్లని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన బూర్గంపహాడ్ మండల మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మరియు బి ఆర్ యస్ పార్టీ నాయకులు, వార్డ్ మెంబర్లు, కార్యకర్తలు, మాజీ ప్రజ ప్రతి నిదులు, మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



## భవిష్యత్తు అంతా బిఆర్ఎస్ ప్రభంజనమే:మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, డిసెంబర్ 15(ప్రజాస్వరం):**

భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా బి.ఆర్.ఎస్ ప్రభంజనమేనని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. రెండవ విడత సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన వనపర్తి మండలానికి చెందిన పార్టీకి చెందిన 12 మంది సర్పంచులు, వార్డు సభ్యులకు సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి అద్భుతమైన విజయాన్ని అందించిన ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అధికార పార్టీ అరాచకాలు, దౌర్జన్యాలకు ఎదురొడ్డి వీరోచితంగా పోరాడిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఈ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా ప్రతిబింబించిందని, రాబోయేది బారాస ప్రభుత్వమేనని ఈ ఫలితాలు చాటిచెప్పాయన్నారు. గెలుపొందిన సర్పంచులు ప్రజల కోసం పని చేసి, వారి మన్ననలు పొందాలని సూచించారు. రాబోయే ప్రభుత్వంలో తమ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

- **గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి**
- **ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్**



**మెదక్, డిసెంబర్ 15 (ప్రజా స్వరం) :**

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నూతనంగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులకు సోమవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు నూతన సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనపై నమ్మకంతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో చేసుకున్న అభివృద్ధి, సేవా, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అతి తొందరలోనే రాబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో ఘనవిజయం సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.







# పోలింగ్‌లో మెదక్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి



- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్, డిసెంబర్ 15 (ప్రజాస్వరం) :**

ముడో విడుత ఎన్నికల్లో ఓటింగ్‌లో ప్రదలందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని, గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ శాతంలో రాష్ట్రంలో 05 స్థానంలో మెదక్ జిల్లా ఉందని, మూడో విడత ఎన్నికలలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజలందరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ మొదటి, రెండవ విడత ఎన్నికలను ప్రశాంతం గా నిర్వహించినట్లే మూడవ విడత ఎన్నికల్లో వివిధ శాఖల అధికారులు సమన్వయముగా పని చేసి పూర్తి చేయాలనీ అన్నారు.ఈ నెల 17 వ తేదీన మూడవ విడత ఎన్నికలు జరిగే మండలాల్లో నర్సాపూర్, చిలిపిచేడ్, కౌడిపల్లి, కొల్చారం శివంపేట్, వెల్దుర్తి, మాసాయిపేట్ మండలాల్లో అత్యధికంగా ప్రజలు పాల్గొని రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు. మొదటి విడతగా మొదటి విడతలో 88.56% రెండో విడత 88.80 % నమోదైందని కలెక్టర్ వివరించారు.

# గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా..

**మాసాయిపేట, డిసెంబర్ 14 (ప్రజాస్వరం) :**



ప్రజలు ఒక్కసారి అవకాశం కల్పిస్తే గ్రామ అభివృద్ధి చేసి చూపిస్తానని స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన ప్పటి నుండీకష్టపడి చదువుకొని గ్రాడ్యుయేట్ గా ఉన్న నేను గ్రామానికి సేవ చేసేందుకే వస్తున్నాను గాని ఆశతో కాదని గ్రామస్తులు నాపై నమ్మకం ఉంచి లేడీస్ పర్స్ గుర్తుకు ఓటు వేసినట్లయితే తప్పకుండా గ్రామంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడుతామన్నారు. గతంలో చేసిన అభివృద్ధి కన్నా గ్రామాన్ని మరింత మెరుగు చేసేలా కృషి చేస్తానని తెలిపారు. మాసాయిపేట నూతన మండలం ఏర్పాటు కోసం తన వంతు కృషి ఎంతో ఉందన్నారు. అలాగే గ్రామంలో గ్రామస్తులకు మినరల్ వాటర్ ప్యూరిఫైయర్ అందించాలనే లక్ష్యంతో బాలవికాస సంస్థ వారితో మాట్లాడి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని ప్రజలకు త్రాగునీరుకు అందించేందుకు ముఖ్యపాత్ర పోషించామని తెలిపారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా



- **నిజాంపేట్ సర్పంచ్ చలిమేటి నరేంద్ర**
- **ఘనంగా విజయోత్సవ ర్యాలీ**

**మెదక్, డిసెంబర్ 15 (ప్రజా స్వరం) :**



గ్రామపంచాయతీ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని నిజాంపేట్ గ్రామ సర్పంచ్ చలమేటి నరేందర్ అన్నారు. గ్రామపంచాయతీ రెండో విడత ఎన్నికల్లో భాగంగా నిజాంపేట్ గ్రామ సర్పంచ్ గా బిజెపి అభ్యర్థి చలిమేటి. నరేందర్ అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పంజ మహేందర్ పై 459 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. సోమవారం నిజాంపేట గ్రామంలో సర్పంచ్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చలిమేటి. నరేందర్ ను గ్రామంలో పలువురు శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ చలిమేటి నరేందర్ మాట్లాడుతూ గ్రామ ప్రజల అభివృద్ధి, పారదర్శక పాలనతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో పరదర్శకంగా వ్యవహరిస్తానని ఈ విజయం తన వ్యక్తిగత గెలుపు కాదని, నిజాంపేట్ ప్రజల విశ్వాసానికి ప్రతీక మాత్రమేనని గ్రామ ప్రజల విశ్వాసానికి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ పేర్కొన్నారు. తనకు ఓటేసి గెలిపించిన గ్రామ ప్రజలకు, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ ర్యాలీలో ఉప్ప సర్పంచ్ గేరిగంటి. బాబు వార్డ్ సభ్యులు ప్రశాంత్, ఎల్లం,కిషోర్, దుర్గయ్య, మల్లేశం, యండి. నసీమ మిరజా గ్రామస్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






# మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులుగా వెంకటేష్



**గజ్వేల్, ప్రజాస్వరం :**

వర్గల్ మండల కాంగ్రెస్ సర్పంచుల ఫోరం అధ్యక్షులుగా కీసర వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచులు నాచగిరి శివారులోని ఓ విశ్రాంతి భవనంలో సమావేశమయ్యారు. ఈ మేరకు ఆయా గ్రామాల సర్పంచులు వెంకటేష్ కు మద్దతు పలకగా, నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. అనంతరం కీసర వెంకటేష్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం మంత్రి వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆంక్షారెడ్డిల సహకారంతో నిధుల మంజూరీకి కృషి చేయనున్నట్లు స్పష్టం చేశారు. త్వరలోనే మంత్రి వివేక్ ను కలిసి ఆయా గ్రామాలలలో నెలకొన్న సమస్యలను దృష్టికి తేనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, మాజీ అధ్యక్షులు సదానంద రెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు సాయి గౌడ్, నేతలు ప్రభుదాస్ గౌడ్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
16.12.2025
మంగళవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com

## ఎమ్మెల్యే కుంభం ను మర్యాదపూర్వకంగా కలిసిన డీసీసీ ఉపాధ్యక్షులు : వాకిటి

**వలిగొండ డిసెంబర్ 15(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి పద్మ అనంతరెడ్డి ఆదివారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో అరూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా వాకిటి పద్మా అనంతరెడ్డి బలపరిచిన కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి సుక్క ముత్యాలు విజయం దుందుభి మోగించిన సందర్భంగా సోమవారం డిసిసి ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి ఆధ్వర్యంలో అరూరు గ్రామం నుండి భారీ ర్యాలీగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నివాసం వరకు చేరుకొని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే నూతనంగా ఎన్నికైన సర్పంచ్ సుక్క ముత్యాలు తో పాటు వార్డ్ మెంబర్లను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర నరసింహ, ఉప సర్పంచ్ గొట్టేటి సత్యనారాయణ, వార్డ్ మెంబర్లు రేఖ మచ్చ గిరి యాదవ్ కసిరబోయిన మచ్చగిరి యాదవ్ వేముల అనిల్ పులగూర్ల మచ్చ గిరి కేదారి మనిషా నరేష్ ఎలిమినేటి సురేష్, బాలరాజు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచిగా నైతిక గెలుపు నాదే సర్పంచ్ అభ్యర్థి పల్సం రమేష్

**వలిగొండ డిసెంబర్ 15(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణంలోని స్వర్ణకారుల భవనంలో సోమవారం రోజు టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జానీ అఫ్రోజ్ అధ్యక్షతన పత్రిక మిత్రుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ వలిగొండ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి పరా జయం పొందిన సర్పంచ్ అభ్యర్థి పల్సం రమేష్ మాట్లాడుతూ వలిగొండ పట్టణ ప్రజలు నన్ను ఆశీర్వదించి సర్పంచి అభ్యర్థిగా నాపై నమ్మకంతో దాదాపు 2500 పైచిలుకు ఓట్లతో నన్ను సర్పంచి అభ్యర్థిగా గుర్తించినందుకుగాను వలిగొండ గ్రామ ప్రజలకు ఓటర్లకు నాయకులకు గాయ కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఓటమి తో వలిగొండ ప్రజలు ఎటువైపు ఉన్నారని తేలిపోయిందని ఆయన పత్రిక మిత్రుల సమావేశంలో అన్నారు. గతంలో నాలుగు పర్యాయాలు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయానని నేను రాజకీయంలో కొచ్చి సంపాదించినది ఏమీ లేదని నాకున్న భూమిని అమ్ముకుని గ్రామ ప్రజల కోసం సేవ చేయడానికి ప్రతిసారి ఓటమి పాల వుతున్నానని ఓటమిపాలైన కుంగిపోకుండా ప్రతిసారి బరిలో నిలుస్తున్నానని గ్రామ ప్రజ లకు సేవ చేయడానికి ముందు కొస్తున్నానని గ్రామంలో నాకు ఉండడానికి ఇల్లు లేకున్నా గ్రామ ప్రజల కు గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి వరిలో నిలుస్తున్నారని ఈ ఓటమితో నేను నైతికంగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మీద గెలిచానని ఈ ఓటమిని గెలుపుగా భావిస్తూ నాకు సహకరించిన గ్రామ ప్రజలకు నాయకులకు కార్యకర్తలకు ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆయన అన్నారు అనంతరం మాజీ జెడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ వలిగొండ మండల పరిధిలో దాదాపుగా బిఆర్ఎస్ సర్పంచ్ లు 18 మంది విజయం సాధించారని మండలంలో 37 గ్రామ పంచాయతీలలో 18 మంది సర్పంచ్ లు గెలుపొందడం బిఆర్ఎస్ పార్టీకి మండలంలోఉన్న బలం తెలిసిపోయిందని దాన్ని గమనించి భువనగిరి శాసనసభ్యులకు కుంభం అనిల్ కుమార్ రెడ్డి గమనించి బిఆర్ఎస్ సర్పంచ్ లుగా గెలిచిన గ్రామాలలో అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకం కల్పించిన దానిపై ఉద్యమం చేస్తామని ఆయన పత్రిక మిత్రుల సమావేశంలో అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన 4వ వార్డు సభ్యులు బల్గూరి నరేష్ రెడ్డికి అదేవిధంగా 12వ వార్డు సభ్యురాలు యాదయ్య లక్ష్మీ సుధాకర్ కు పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఐటి పాముల సత్యనారాయణ కొండూరు వెంకటేశం పబ్బు శ్రీనివాస్ భగత్ బెలిదె శ్రీనివాస్ కళ్లెం మారయ్య తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో ఉపాధ్యాయ శిక్షణ ఫలితాలేమిటి?..

- సమగ్ర శిక్ష నిధులు ఎంత ఖర్చయ్యాయి?
- నిష్ఠా–దీక్షా ద్వారా రాష్ట్రంలో బోధనా సామర్థ్యం ఎంత మెరుగుపడింది?
- 2020–21 నుంచి తెలంగాణకు సమగ్ర శిక్ష కింద ఎంత నిధులు విడుదలయ్యాయి?
- లోక్ సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
- లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన కేంద్ర విద్యా శాఖ మంత్రి

**ఖమ్మం డిసెంబర్ 15(ప్రజాస్వరం):**

తెలంగాణలో ఉపాధ్యాయుల శిక్షణ, డిజిటల్ బోధన ప్రభావం, అలాగే సమగ్ర శిక్ష అభియాన్ కింద రాష్ట్రానికి కేటాయిస్తున్న నిధుల వినియోగంపై ఖమ్మం లోక్‌సభ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో ప్రస్తావించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రెండు కీలక ప్రశ్నలను లేవనెత్తారు. దీనికి కేంద్ర విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వక సమాధానాలు ఇచ్చారు.

**నిష్ఠా–దీక్షాతో ఉపాధ్యాయ శిక్షణ..**

దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని పెంచేందుకు సమగ్ర శిక్ష అభియాన్ కింద నేషనల్ ఇనిషియేటివ్ ఫర్ స్కూల్ హెడ్స్, టీచర్స్ హోలీస్టిక్ అడ్వాన్స్మెంట్ (నిష్ఠ) జాతీయ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని కేంద్రమంత్రి తెలిపారు. ఈ శిక్షణను దీక్ష డిజిటల్ వేదిక ద్వారా 2020 అక్టోబర్ నుంచి అందిస్తున్నట్లు, బోధనలో ఐసీటీ వినియోగం, విద్యార్థి కేంద్రిత పద్ధతులు, స్వీయ మూల్యాంకనం, పాఠ్య ప్రణాళికలు, ఇంటరాక్టివ్ కంటెంట్ వంటి అంశాలపై ఈ శిక్షణ దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు.

ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 63 లక్షలకుపైగా ఉపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిష్ఠా శిక్షణ పొందినట్లు వెల్లడించారు. ప్రాథమిక దశతో పాటు మాధ్యమిక స్థాయి ఉపాధ్యాయులకు కూడా ఈ శిక్షణను విస్తరించామని, ఫౌండేషనల్ లిటరసీ-న్యూమరసీ, ప్రీ-ప్రైమరీ (ఈసిసిఈ) రంగాలకు ప్రత్యేకంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

**తెలంగాణకు సమగ్ర శిక్ష నిధులు..**

సమగ్ర శిక్ష అభియాన్ కింద 2020-21 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరాల వరకూ



తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం గణనీయమైన నిధులు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. 2020-21లో కేంద్ర వాటా రూ.348.07 కోట్లు - మొత్తం వ్యయం రూ.1061.93 కోట్లు, 2024-25లో కేంద్ర వాటా రూ.988.79 కోట్లు - మొత్తం వ్యయం రూ.1691.41 కోట్లుగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఐదు సంవత్సరాల్లో తెలంగాణకు కేంద్రం విడుదల చేసిన మొత్తం నిధులు సుమారు రూ.3953 కోట్లు,
రాష్ట్ర వాటాతో కలిపి రూ.7,100 కోట్లకుపైగా విద్యా రంగంలో ఖర్చు చేసినట్లు వెల్లడించారు. నిధుల విడుదల-పర్యవేక్షణ ఎలా? సమగ్ర శిక్ష కింద నిధుల విడుదల రాష్ట్రాల వ్యయ వేగం, రాష్ట్ర వాటా జమ, ఆడిట్ నివేదికలు, వినియోగ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా జరుగుతుందని తెలిపారు. 'ప్రబంధ్' అనే ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థను అమలు చేస్తున్నామని, రాష్ట్రాలతో తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ పథకం సజావుగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించించారు. తెలంగాణలో విద్యా వ్యవస్థ బలోపేతం, ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధి, నిధుల సమర్థ వినియోగమే లక్ష్యంగా కేంద్ర-రాష్ట్ర సమన్వయంతో సమగ్ర శిక్ష పథకాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని కేంద్ర విద్యాశాఖ మంత్రి స్పష్టం చేశారు.

## ఓటమి భయంతో చిల్లర రాజకీయాలు : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి, డిసెంబర్ 15(ప్రజాస్వరం):**

ఓటమి భయంతో కొందరు నాయకులు చిల్లర రాజకీయాలకు దిగుతున్నారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. కాంగ్రెస్ మద్దతుతో గెలిచిన సర్పంచులతో చీకటి ఒప్పందాలు చేసుకుంటూ నిస్సిగ్గుగా ఫోటోలు దిగడం సిగ్గుచేటని విమర్శించారు. ఇలాంటి రాజకీయ వ్యభిచారానికి పాల్పడే నాయకులను ప్రజలు ఎప్పటికీ నమ్మరని ఆయన స్పష్టం చేశారు. మూడవ విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పెబ్బేరు మండలంలోని రంగాపురం, జనంపల్లి, బూడిదపాడు, పాతసుగుర్, కొత్త సూగూరు, యాపర్ల, గుమ్మడం, గుమ్మడంతాండ, అయ్యవారిపల్లి, పాతపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని డప్పు వాయిద్యాల మధ్య నృత్యాలు చేస్తూ పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో కొందరు నాయకులు చీకటి ఒప్పందాలకు పాల్పడుతూ కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కన్నతల్లిలాంటి కాంగ్రెస్ పార్టీకి నిబద్ధంగా పనిచేసే వారికి మాత్రమే పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని, రాజకీయ లబ్ధి కోసం పార్టీ పేరు చెప్పుకునే వారిని దగ్గరకు కూడా రానివ్వకూడదన్న తన మాటలను కొందరు వక్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఎన్ని ఎత్తుగడలు వేసినా, నీచ రాజకీయాలు చేసినా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలం పెరుగుతోందని అన్నారు. ప్రస్తుతం సర్పంచులుగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ మద్దతు అభ్యర్థులు ఎవ్వరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, అంతిమ విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచిత కరెంటు, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, మహిళలకు వడ్డీ లేని రుణాలు, సన్న బియ్యం పంపిణీ, ఉన్నత విద్య, మెరుగైన వైద్యం వంటి సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రజాపాలన



కొనసాగుతోందని తెలిపారు. రానున్న మూడు సంవత్సరాల్లో అన్ని గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మద్దతు అభ్యర్థులు సర్పంచులుగా గెలిస్తే గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు నిర్వీర్యమయ్యాయని, ఎందరో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. అలాంటి పాలన అందించిన నాయకులు నేడు నీతులు చెప్పడం సరికాదన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఉన్న గ్రామాల్లో కూడా కాంగ్రెస్‌కే అధిక ఓట్లు పోలయ్యాయని గుర్తుంచుకోవాలని అన్నారు. మరో పదమూడు సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని ప్రజలను తప్పుదోవ పట్టించే మాటలను నమ్మవద్దని కోరారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేన రెడ్డి, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ప్రముఖ వైద్యులు పగిడాల శ్రీనివాస్, పట్టణాధ్యక్షులు వెంకట్రాములు, నాయకులు రంజిత్ కుమార్, దయాకర్ రెడ్డి, సత్యం, రాములు యాదవ్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బి.కృష్ణతో పాటు ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు బీసీ రిజర్వేషన్ల పెంపుదలకు తెలంగాణ ఉద్యమం తరహాలో ముందుకు సాగుతాం

**బూర్గంపహాడ్ డిసెంబర్ 15(ప్రజాస్వరం):**

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని తమ పార్టీ గట్టిగా పోరాడుతున్నదని, ఇందుకోసం ప్రైవేట్ మెంబర్ బిల్లు కూడా ప్రవేశపెట్టడం జరిగిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. అన్ని రంగాలలో వెనుకబడిన బీసీ వర్గాల సంక్షేమం, అభ్యున్నతికి బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు తన పదేళ్ల పాలనలో చిత్తశుద్ధితో కృషి చేశారని,రిజర్వేషన్స్ పెంపుదలకు కట్టుబడి ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే 2014 జూన్ 14వ తేదీన చట్టసభల్లో మహిళలు, ఓబీసీలకు 33 శాతం చొప్పున రిజర్వేషన్స్ కల్పించాలని కోరుతూ కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి సిఫార్సు చేయడాన్ని ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.జాతీయ బీసీ సంక్షేమ సంఘం,బీసీ జేఏసీల ఆధ్వర్యాన సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం ఏర్పాటైంది.దీనికి సంఘీభావం ప్రకటిస్తూ ఎంపీ రవిచంద్ర,మాజీ వీ.శ్రీనివాస్ గౌడ్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ నాయకత్వాన జరిగిన మహోద్యమం మాదిరిగానే బీసీల న్యాయమైన హక్కులు, రాజ్యాధికారంలో సముచితమైన వాటా కోసం బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. కుల గణనలో బీసీల జనాభాను తక్కువ చేసి చూపడం, కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రకటించిన రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం, ఇతర 56 అంశాల గురించి ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ తమ పార్టీ ఉద్యమించిందన్నారు. దీనిని మరింత ఉధృతం చేయడంలో భాగంగానే కేసీఆర్ మార్గనిర్దేశనంలో పార్లమెంటులో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టడం జరిగిందని ఎంపీ రవిచంద్ర వివరించారు. కాంగ్రెస్ నాయకులు, రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన 432 హామీలను నెరవేర్చకుండా "డైవర్షన్ పాలిటిక్స్"కు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. తమ పార్టీ




ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లుకు ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, అటు కేంద్రంలోని బీజేపీ పాలకులు మద్దతు ప్రకటించడం అనివార్యమని, లేనిపక్షంలో వారు ద్రోహులుగా మిగిలిపోక తప్పదని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధినేత రాహూల్ గాంధీకి "ఓట్ చోర్"అంశంపై ఉన్న ఆసక్తి బీసీ రిజర్వేషన్లు పెంచే విషయంలో ఇసుమంత కూడా చూపకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్, బీజేపీలు తల్చుకుంటే బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందడం సునాయాసంగా జరుగుతుందని ఎంపీ రవిచంద్ర చెప్పారు. ఆ పార్టీలకు బీసీలంటే చులకన భావం ఉన్నందునే తాము అన్ని రంగాలలో తీవ్ర అన్యాయానికి గురవుతున్నామని ఎంపీ వద్దిరాజు ఆవేదన చెందారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన బిల్లు పార్లమెంటులో చర్చకు వచ్చినప్పుడు తెలంగాణకు చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు వారి అధి నాయకత్వాలపై వత్తిడి పెంచి ఆమోదం పొందేలా చూడాలని ఎంపీ రవిచంద్ర కోరారు. దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలు రాజ్యాధికారంలో తమకు న్యాయమైన వాటా దక్కడం లేదన్న కడుపు మంటతో ఉన్నారని, కోపంతో రగిలిపోతున్నారని ఆయన చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో 42%, చట్టసభల్లో మహిళలతో పాటు 33 శాతం చొప్పున రిజర్వేషన్స్ అమలునకు కాంగ్రెస్, బీజేపీలు ముందుకు రానట్టయితే ప్రజల ఆగ్రహానికి గురి కాక తప్పదని,మాడిమసైపోవడం ఖాయమని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.

## అక్రమ నిర్మాణాల అడ్డాగా విశాఖ నగరం, ఇదే అధికారులకు కాసుల వర్షం

**విశాఖ పట్నం, డిసెంబర్ 15(ప్రజాస్వరం):**

అక్రమ నిర్మాణాల అడ్డాగా విశాఖ నగరం వర్ధిల్లుతోంది. ఇదే అధికారులకు కూడా కాసుల వర్షం కురిపిస్తోంది. కోర్టు స్టేల పేరుతో బిల్డర్ల మోచేతి నీళ్లు తాగుతూ టౌన్ ప్లానింగ్ అధికారులు తమ ధన దాహం తీర్చు కొంటున్నారు. మత్తునిద్ర నటిస్తున్న జోనల్ అధికారులపై జీవీఎంసీ కమిషనర్ దృష్టి సారిస్తే అక్రమార్కులకు చెమటలు పట్టడం ఖాయంగా కనిపిస్తోంది. నియమ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవలసిన అధికారులు లంచాలకు



అమ్ముడు పోయి అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారని నార్త్, వెస్ట్, పెందుర్తి అధికారులపై స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం నియమ నిబంధనలు అమలు పరచడంలో జోన్లో టౌన్ ప్లానింగ్ ఏసిపి, టి పి ఓ పూర్తిగా విఫలం చెందారని ఇక్కడ దబ్బుకు లోకం దాసోహం అన్న అధికారుల తీరు మారడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులపై ఉన్నతాధికారలు చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు. అందు కోసమే కింది స్థాయిలో ఉన్న అధికారులు, సిబ్బంది కోట్లకు పడగలెత్తుతున్నారు. వీరి వికృత పోకడలపై ప్రభుత్వం కఠిన చర్యలు చర్యలు తీసుకుంటే కొంచెం అవినీతికి బ్రేకులు పడుతుంది.

## జమ్మిగడ్డ ప్రత్యేక డివిజన్ కోసం ప్రజాగర్జన

- కాప్రా సర్కిల్ వరకు భారీ ర్యాలీ
- రిలే నిరాహార దీక్ష అనంతరం జమ్మిగడ్డలో భారీ నిరసన ర్యాలీ

**కాప్రా డిసెంబర్ 15(ప్రజాస్వరం):**

కాప్రాసర్కిల్ లోని జమ్మిగడ్డ ప్రాంతాన్ని ప్రత్యేక డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు ఉద్యమం చేపట్టారు. రెండు రోజుల రిలే నిరాహార దీక్ష అనంతరం మూడవ రోజు జమ్మిగడ్డ ప్రాంతానికి చెందిన సుమారు 300 మందికి పైగా ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. సోమవారం ఉదయం జమ్మిగడ్డ సాధన సమితి ఆధ్వర్యంలో డప్పు చప్పులతో నిరసన ర్యాలీ ప్రారంభమైంది. ఎన్‌టిఆర్ విగ్రహం నుంచి రాధిక మీదుగా ఈసీఐఎల్ చౌరస్తా, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ మీదుగా కాప్రా సర్కిల్ కార్యాలయానికి చేరుకుంది. జమ్మిగడ్డలోని అన్ని కాలనీలను కలిపి ప్రత్యేక డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ డీసీకి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం జమ్మిగడ్డ ప్రాంతం పలు డివిజన్లలో విభజించబడటం వల్ల మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు తెలిపారు. ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేస్తే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. సర్కిల్ కార్యాలయం ఎదుట ముక్తకంఠంతో నినాదాలు చేస్తూ బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. దాదాపు రెండు గంటల పాటు నినాదాలతో ప్రాంతం దద్దరిల్లింది. అనంతరం డిప్యూటీ కమిషనర్ జగన్ బయటకు వచ్చి వినతి పత్రాన్ని స్వీకరించారు. జమ్మిగడ్డను ప్రత్యేక డివిజన్‌గా ప్రకటించే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. జమ్మిగడ్డను ప్రత్యేక డివిజన్‌గా ప్రకటించకపోతే మరో ఉద్యమం చేపడతామని ఉద్యమకారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జమ్మిగడ్డ ప్రాంతానికి చెందిన కాలనీల ప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999